

మహదేవపూర్ : ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు



కాటారం : గడపగడపకూ వెళ్లి ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

# జోరుగా బీఆర్ఎస్ ఇంటింటా ప్రచారం

- మ్యానిఫెస్టోను వివరిస్తున్న పార్టీ శ్రేణులు
- పుట్ట మధును గెలిపించాలని వినతి
- ప్రజల్లో సానుకూల స్పందన

కాటారం, నవంబర్ 15 : మండల కేంద్రంలో ఇంటింటా ప్రచారం జోరుగా సాగుతున్నది. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోట జనార్దన్ ఆధ్వర్యంలో బుధవారం గ్రామంలో ప్రచార రథంతో ర్యాలీ తీశారు. గడపగడపకూ వెళ్లి బీఆర్ఎస్ మ్యానిఫెస్టో గురించి వివరించారు. 40 ఏళ్లలో కాంగ్రెస్ చేయలేని అభివృద్ధి కేవలం 4 ఏండ్లలో పుట్ట మధు చేసి చూపించారన్నారు. ఆ అభివృద్ధి నిరంతరం కొనసాగాలంటే ప్రజలంతా కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ అభ్యర్థి పుట్ట మధును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు సౌజన్యరెడ్డి, ఎస్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు పంతకాని సడవలి, ఎస్టీ సెల్ సబ్ డివిజన్ అధ్యక్షుడు తైనేని సతీశ్, మండల ప్రధాన కార్యదర్శి జోడు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు రాంచందర్, నాయకులు బొడ్డు రాజబాబు, సంతోష్, వెంకటస్వామి, శ్రీలక్ష్మీ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

**మహదేవపూర్‌లో..**

మహదేవపూర్ : మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో బీఆర్ఎస్ ఇంటింటా ఎన్నికల ప్రచారం జోరుగా కొనసాగుతుంది. బుధవారం బీఆర్ఎస్ శ్రేణులు గడపగడపకూ వెళ్లి ప్రచారం చేశాయి. బీఆర్ఎస్ మ్యానిఫెస్టో ప్రతులను పంపిణీ చేశారు. సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీపతిబాపు, ఉప సర్పంచ్ సల్మాన్‌ఖాన్, ఏఎంసీ చైర్‌పర్సన్ మమత, ఎంపీటీసీ చల్ల పద్మ, డివిజన్ మహిళా అధ్యక్షురాలు కే గీత, మహిళా మండల అధ్యక్షురాలు ఓ స్వప్న, కాళేశ్వరాలయ మాజీ చైర్మన్ పోత వెంకటస్వామి, బీఆర్ఎస్ బీసీ సెల్ మండల అధ్యక్షుడు బాపూరావు, యూత్ డివిజన్ ప్రధాన కార్యదర్శి మెరుగు శేఖర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అన్కారీ ప్రకాశ్, టీ శ్రీహరి, రమేశ్, మెరుగు లక్ష్మణ్, యూత్ నాయకులు అలీంఖాన్, రేవెళ్లి రాజశేఖర్, చిలుక రమేశ్, బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**కాళేశ్వరంలో..**

కాళేశ్వరం : మహదేవపూర్ మండలం కాళేశ్వరంతో పాటు పలు గ్రామాల్లో బీఆర్ఎస్ అభ్యర్థి పుట్ట మధుకర్ గెలుపు కోసం ప్రచారం జోరుగా సాగుతున్నది. ఇంటింటికీ వెళ్లి కారు గుర్తుకే ఓటు వేయాలని అభ్యర్థించారు. కాళేశ్వరంలో సర్పంచ్ వసంతా మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. గ్రామ అధ్యక్షులు రమేశ్, నాయకులు ఓగేశ్, సడవలి, సురేశ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విషాద ప్రేమ

**పెద్దలు పెళ్లికి ఒప్పుకోకపోవడంతో బలవన్మరణం**



రాజేశ్, శిరీష (ఫైల్)

మంగపేట, నవంబర్ 15 : జీవితాంతం కలిసి బతుకుదామను కున్న ప్రేమికులు పెద్దలు పెళ్లికి అంగీకరించకపోవడంతో గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. ఆసుపత్రి పాలై చికిత్స పొందుతూ ప్రేమికులిద్దరూ మృతి చెందిన విషాద ఘటన మండలంలోని మల్లూరు హేమాచల క్షేత్ర సమీపంలో జరిగింది. మృతుల బంధువులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏటూరునాగారం మండల కేంద్రానికి చెందిన బెజ్జంకి రాజేశ్ (24), మంగపేట మండలం కమలాపురానికి చెందిన మాదరి శిరీష(20) కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. వారి వివాహానికి పెద్దలు అంగీకరించకపోవడంతో తీవ్ర మనస్తాపం చెంది ఈనెల 14న మల్లూరు గుట్ట సమీపంలో గడ్డి మందు తాగారు. శిరీష ఈ విషయాన్ని వాట్సాప్‌లో తాము ఉన్న ప్రదేశం లొకేషన్‌ను కుటుంబ సభ్యులకు పంపింది. వారు అక్కడికి వెళ్లి అపస్మారక స్థితిలో ఉన్న వారిని 108లో ఏటూరునాగారం సామాజిక వైద్యశాలకు తరలించారు. వైద్యుల సూచన మేరకు వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. శిరీష ఏటూరునాగారం డిగ్రీ కాలేజీలో ఫైనలియర్ అభ్యసిస్తూ, ఓ ప్రైవేటు దవాఖానలో నర్సుగా పని చేస్తోంది. రాజేశ్ ఆ సమీపంలోని ఓ ఫర్టిలైజర్ షాపులో పని చేస్తున్నాడు. ఈ క్రమంలోనే వీరిరువురికి పరిచయం ఏర్పడి, ప్రేమకు దారి తీసినట్లు తెలిసింది. వారి మృతితో రెండు కుటుంబాల్లో తీరని విషాదం అలుముకున్నది.

## పెరిగిన విషముష్టి గింజల ధర

ఏటూరునాగారం, నవంబర్ 15 : విషముష్టి గింజల ధరలను పెంచుతూ గిరిజన సహకార సంస్థ నిర్ణయం తీసుకున్నట్లు స్థానిక జీసీసీ బ్రాంచ్ మేనేజర్ దేవ్ తెలిపారు. కేజీ ధర రూ. 45 ఉండగా ఒకేసారి రూ. 70లకు పెంచుతూ సంస్థ ప్రకటించినట్లు తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో విషముష్టి గింజల సేకరణపై బుధవారం గిరిజనులకు అవగాహన కల్పించారు. గత ఏడాది 60 క్వింటాళ్లు మాత్రమే సేకరించామని, ఈసారి 500 క్వింటాళ్లు లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన తెలిపారు. మంగపేట, ఏటూరునాగారం, తాడ్వాయి, కన్నాయిగూడెం మండలాల్లోని గిరిజన గ్రామాల్లో పర్యటిస్తున్నట్లు తెలిపారు. గిరిజనులు సేకరించిన గింజలకు కొనుగోలు చేసిన వెంటనే చెల్లింపులు చేస్తున్నట్లు తెలిపారు. అందుబాటులో ఉన్న రేషన్ షాపుల్లోనే వీటిని సేల్స్‌మెన్‌లు కొనుగోలు చేస్తారని తెలిపారు. గిరిజనులు దీనిని సద్వినియోగం చేసుకుని లబ్ధి పొందాలని కోరారు. ఆయన వెంట సేల్స్‌మెన్లు, సిబ్బంది ఉన్నారు.

## అదుపుతప్పి చెట్టును ఢీకొన్న లారీ

**ఒకరి మృతి, డ్రైవర్‌కు గాయాలు**

ఏటూరునాగారం, నవంబర్ 15 : మండలంలోని చిన్నబోయినపల్లి సమీపంలో ఇసుక లారీ అదుపు తప్పి చెట్టును ఢీ కొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందగా లారీ డ్రైవర్ గాయపడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. వాజేడు మండలం ధర్మవరం నుంచి హైదరాబాద్‌కు ఇసుకను తీసుకెళ్తున్న లారీ ఏటూరునాగారం మండలం చిన్నబోయినపల్లి సమీపంలో అదుపు తప్పింది. ఇదే లారీలో ఏటూరునాగారం చెక్‌పోస్టు వద్ద హనుమకొండకు వెళ్లేందుకు మంగపేట మండలం కోమటిపల్లికి చెందిన కొత్తపల్లి పెద్ద సమ్మయ్య(55) లారీ ఎక్కాడు. ఆయన లారీ ఎక్కిన ఐదు నిమిషాలకే ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో పెద్ద సమ్మయ్య అక్కడికక్కడే మృతి చెందగా లారీ డ్రైవర్ యశ్వంత్ క్యాబిన్‌లో ఇరుక్కున్నాడు. సీఐ రాజు, ఎస్సై కృష్ణ ప్రసాద్ జేసీబీ, గ్యాస్ వెల్డర్ సహాయంతో డ్రైవర్‌ను బయటకు తీశారు. మృతుడికి భార్య సత్యవతి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. డ్రైవర్ యశ్వంత్‌ను ఏటూరునాగారంలోని సామాజిక వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఓటు హక్కు ప్రాధాన్యం, వినియోగంపై అవగాహన

మహాముత్తారం, నవంబర్ 15 : ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఎంపీడీవో పెద్ది ఆంజనేయులు అన్నారు. బుధవారం మండలంలోని దొబ్బలపహడ్ మోడల్ పాఠశాల, ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన మానవహారానికి హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ రాజు, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీవో శ్రీనివాసరావు, ఏపీఎం రామకృష్ణ, జేపీఎస్ వేణుగోపాల్, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

**కాటారంలో..**

కాటారం : ఓటు హక్కు ప్రాధాన్యం, వినియోగంపై ప్రజలకు అవగాహన కోసం కాటారం మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, ఈజీఎస్ సిబ్బంది బుధవారం ర్యాలీ తీశారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శంకర్ నాయక్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకున్నప్పుడే ప్రజాస్వామ్యం బలోపేతం అవుతుందన్నారు. అలాగే కాటారం ఉన్నత పాఠశాలలో పిల్లలు, ఉపాధ్యాయులతో ప్రతిజ్ఞ చేయించారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో హెచ్‌ఎం హైమద్, ఉపాధ్యాయులు పరంసింగ్, సుజాత, జేపీఎస్ షగీర్‌ఖాన్, ఎంపీవో ఉపేంద్రయ్య, ఉపాధి హామీ ఏపీఓ వెంకన్న, కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బంది విద్యానాథ్, నాయకులు రవిశంకర్, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.




మహాముత్తారం : ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ తీస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

**మహదేవపూర్‌లో..**

మహదేవపూర్ : మండల కేంద్రంలో బుధవారం అధికారులు ఓటు హక్కు ప్రాముఖ్యతపై ర్యాలీ తీసి అవగాహన కల్పించారు. మండల కేంద్రంలోని ప్రధాన కూడళ్లలో ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ లక్ష్మీరాజయ్య, ఎంపీడీవో రవీంద్రనాథ్ మాట్లాడుతూ ఓటర్లు తప్పనిసరిగా ఓటు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీడీపీవో రాధిక, ఎంపీవో ప్రసాద్, ఏపీవో రమేశ్, సెర్ప్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మావోయిస్టులకు సహకరించొద్దు

మహదేవపూర్, నవంబర్ 15 : మావోయిస్టులకు సహకరిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ కిరణ్ హెచ్చరించారు. బుధవారం ఎస్సై రాజ్ కుమార్, సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్, పోలీసుల సిబ్బందితో కలిసి మండల పరిధిలోని పెద్దంపేటలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఇంటింటా తనిఖీలు చేశారు. అనంతరం గ్రామంలోని ప్రధాన కూడలిలో గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాలు విక్రయించవద్దన్నారు. గ్రామాల్లో అపరిచితుల పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, యువకులు, పోలీసులు పాల్గొన్నారు.

## సిలబస్‌ను పూర్తి చేయాలి

ములుగురూరల్, నవంబర్15 : 10వ తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు సిలబస్‌ను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని డీఈఓ పాణిని ఆదేశించారు. బుధవారం ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా చూస్తూ హాజరు శాతాన్ని పెంచాలన్నారు. డిసెంబర్‌లోగా సిలబస్ పూర్తి చేసి వార్షిక పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర పరిశీలకుడు రాఘవులు, సంజీవ, ఎంఈఓ శ్రీనివాసులు, హెచ్‌ఎం విజయమ్మ, ఉపాధ్యాయులు సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

## వజ్జ రాజుకు ఫెలోషిప్ అవార్డు



భూపాలపల్లి రూరల్/ములుగురూరల్, నవంబర్15 : ములుగు మండలంలోని రాయినిగూడెం గ్రామానికి చెందిన పీసా మొబిలైజర్, చమక్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి వజ్జ రాజుకు అంబేద్కర్ జాతీయ ఫెలోషిప్ అవార్డు లభించింది. భారతీయ దళిత సాహిత్య అకాడమీ ద్వారా అవార్డు వచ్చినట్లు రాజు పేర్కొన్నారు. భూపాలపల్లి జిల్లాలో కాంట్రాక్టు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నట్లు తెలిపారు. ఖాళీ సమయాల్లో గిరిజన ఆదివాసీ చట్టాలపై గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. డిసెంబర్ 10న ఢిల్లీలో అవార్డును తీసుకోనున్నట్లు వివరించారు. రాజును చమక్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అజామ్, పీసా కోఆర్డినేటర్ కొమురం ప్రభాకర్, గ్రామస్తులు అభినందించారు.

## ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధ్యాపకుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా స్వామి



కాటారం, నవంబర్ 15 : తెలంగాణ ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధ్యాపకుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా కాటారం ప్రభుత్వ జూనియర్ కళాశాల తెలుగు అధ్యాపకుడు బీ స్వామిని నియమిస్తున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బరిగెల నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు, విద్యార్థుల సంక్షేమం కోసం వారి సమస్యల పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తానని స్వామి పేర్కొన్నారు. రాష్ట్ర అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపారు.

## నేడు ఉపన్యాస పోటీలు

భూపాలపల్లి రూరల్, నవంబర్ 15 : భూపాలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషలో ఉపన్యాస పోటీలు గురువారం జిల్లా స్థాయిలో నిర్వహించనున్నట్లు రాంకుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ ప్రకృతి వైద్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ పాఠశాలల 8,9వ తరగతి విద్యార్థులకు 'మానవ జీవన విధానంలో ప్రకృతి పాత్ర' అనే అంశంపై పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రథమ బహుమతిగా రూ.3000, ద్వితీయ రూ.2000, తృతీయ రూ.1000 అందజేయనున్నట్లు వివరించారు. ప్రథమ బహుమతి పొందిన విద్యార్థిని 18న రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామని తెలిపారు.

## టెన్త్‌లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

**గిరిజన సంక్షేమ శాఖ డీడీ పోచం**

ఏటూరునాగారం, నవంబర్ 15 : పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని గిరిజన సంక్షేమ శాఖ డీడీ పోచం సూచించారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో బుధవారం ములుగు, భూపాలపల్లి జిల్లాల్లోని గిరిజన సంక్షేమశాఖ గిరిజన ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు, సబ్జెక్ట్ టీచర్లతో సమావేశం నిర్వహించారు. టెన్త్‌లో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు వంద రోజుల ప్రోగ్రాం అమలు చేయాలన్నారు. సబ్జెక్టు టీచర్లు విద్యార్థుల గ్రేడ్‌లను చూసుకోవాలన్నారు. అత్యధిక ఉత్తీర్ణత సాధించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. చదువులో వెనుకబడిన వారిపై ప్రత్యేక ఫోకస్ పెట్టాలన్నారు. సమావేశంలో ఏటీడీవో దేశీరాం నాయక్, ఏసీఎంవో రవీందర్, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మద్యం స్వాధీనం

గోవిందరావుపేట, నవంబర్ 15 : మండలంలోని పస్రాలో ఓ బెల్ట్ షాపుపై బుధవారం ఎస్సై షేక్ మస్తాన్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో అక్రమంగా షాపుల్లో మద్యం నిల్వ ఉంచి విక్రయిస్తున్న రూ.5,900 విలువైన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.